**సికింద్రాబాదు మోండా మార్కెటుకెళ్లే దారిలో ఉన్న జాహ్నవి టెక్స్‌టైల్స్ నాలుగంతస్థుల భవనం చూడటానికి రెండు కళ్లు చాలనంత అద్భుతంగా ఉంటుంది. మూడవ అంతస్తులో బంగారు ఆభరణాలు కూడా పెట్టడం వల్ల ఎప్పుడూ కస్టమర్లతో, దాదాపు నూటయాభై మంది సేల్స్ బాయ్స్, గాల్స్‌తో పండగ వాతావరణంతో సందడి సందడిగా ఉంటుంది. రాబోయే కొద్దిరోజుల్లో శుభకార్యాలు ఉండటం వల్ల నిన్ననే షాపుకు కొత్త స్టాకు వచ్చింది. కిడ్స్, జెంట్స్, లేడిస్ సెక్షన్లకు సంబంధించిన సేల్స్ బాయ్స్, గాల్స్ ఆ స్టాకును అరల్లో చక్కగా సర్దుతున్నారు. రజితది చీరల సెక్షన్. ప్యాకెట్ల నుంచి తీసిన చీరలు నీటుగా సర్దుతోంది. సరిగ్గా అప్పుడు.. చూసింది నెమలి కంఠం రంగు మీద తెల్లని చిన్నచిన్న పూల చీర అందమైన బోర్డర్‌తో అద్భుతంగా ఉంది. దాన్ని వెంటనే అరలో కింద దాచేసింది.**

"బట్టలు అరల్లో సర్దడం అంత సేపా?" అంటూ అందరినీ ఉరిమి చూశాడు భూపతి. భూపతి ఆ ఫ్లోర్ ఇంచార్జ్. యముడు. "పని పని" అంటూ అందరి ప్రాణాలు తీసేస్తాడు. కర్కోటకుడిగా కనిపిస్తాడు. కర్కశంగా మాట ల్తో హింసిస్తాడు. వాడంటే అందరికీ భయమే!

రజిత పది ఫెయిలయింది. చదువుకో వాలని ఉన్నా ఇంటి పరిస్థితులు అనుకూలిం చక పోవడం వల్ల సంవత్సరం క్రితం ఆ షా పులో సేల్స్ గాల్‌గా జాయినయింది. ఇంట్లో వాళ్లు పెళ్లి చేయాలని నిర్ణయించడం, నిశ్చయ తాంబూ లాలు ఇచ్చి పుచ్చుకోవడం అన్నీ అయిపోయాయి. రెండు నెలల్లో పెళ్లి.

లంచ్ టైం. అందరూ తినడానికెళ్లి పోయారు.

"రజితా.. నువ్వు తినవా.. పద" అంది పారిజాత.

"ఓపదినిమిషాల పనుంది. నువ్వెళ్లు.. నేనొస్తా" అంది.

అందరూ వెళ్లిపోయాక అర కింద నుంచి ఆ చీర తీసింది. కింద ఉన్న స్టూల్ మీద పెట్టి రెండు చేతులతో అపురూపంగా తడిమింది. తనివితీరా చూసుకుంది. భుజం మీద వేసుకుని గోడకు బిగించిన అద్దంలో చూసుకొని మురిసి పోయింది. మెల్లగా దాని రేటు చూద్దామని ప్రైస్ ట్యాగ్ తీసిచూసింది. గుండాగిపోయింది. తన ఆరునెలల జీతం. అది ఎవరి కంటా పడకుండా అరలో చివరి కంటా పెట్టి భోజనానికి బయల్దేరింది.

"అక్కా చానా లేటయిందీ.." రవి పలక రించాడు.

రవి నాలుగు నెలల క్రితం జాయిన య్యాడు. అంతకుముందు ఒక ఇండస్ట్రీలో పనిచేసేవాడట. చాలా మంచివాడు. రజిత అంటే వాడికెందుకో అభిమానం. అతడి కాలేయంలో ఏదో సమస్య ఉందట. సంవ త్సరంలోపు ఆపరేషన్ కూడా చేయించుకోవా లట! అతడికి నా అంటూ ఉన్నది అమ్మ ఒక్కతే. ఆవిడకు నిజం చెప్పలేదు. తన ఆపరేషన్‌కు కావలసిన డబ్బు తనే కూడబెట్టు కుంటాడట. పొద్దుట పూట షాపు ఊడవడం దగ్గర్నుంచి. సేల్స్ బాయ్‌గా అందరికీ బట్టలు చూపించడం. ఎంత రాత్రయినా అన్నీ చక్కగా మడతెట్టి అరల్లో సర్దడంవంటివి విసుగూ విరామం లేకుండా చేసి ఇంటికి వెళతాడు. అందుకని మరికాస్త డబ్బు ఎక్కువ సంపాది స్తాడు. అలా కష్టపడి సంపాదించిన డబ్బును పైసాపైసా చూసుకుంటూ చాలా పొదుపుగా ఖర్చు పెడతాడు. ఎప్పుడైనా రజితకు ఆప్యా యంగా అవీ ఇవీ తినడానికి తెచ్చిపెడుతుం టాడు. అతని సంగతి తెలుసు కాబట్టి రజిత గట్టిగానే తిరస్కరిస్తుంది. కానీ అతడు వినడు. 'నాకంటూ తోడబుట్టిన వాళ్లెవరూ లేరు. నిన్ను చూస్తే ఆ లోటు తీరినట్టనిపిస్తది. నువ్వు దేవుడిచ్చిన అక్కవి' అంటూ మాటలతో మాయ చేస్తాడు. కొన్ని బంధాలు ఎందుకో చాలా చిత్రం గా ఏర్పడతాయి.

సాయంత్రం ఆ చీర తను కొనుక్కుంటా నని. దాని ధర తన జీతంలోంచి సంవత్సరం పాటు కొద్ది కొద్దిగా కోసుకోమని చెప్పింది.

"సంవత్సర కాలం నువ్వు పని చేస్తావని గ్యారంటీ ఏమిటి.. మధ్యలో నువ్వు పారిపోతే నేను కట్టుకోవాలా? పిచ్చిపిచ్చి ఆలోచనలు మానుకుని వెళ్లి పనిచేసుకో" అని అరిచాడు భూపతి.

రజిత బతిమాలినా వినిపించుకోలేదు.

ఆ తర్వాత ప్రతిరోజు దాన్ని చూసు కొని ఆనందించడం.. మళ్లీ అంతలోనే తన తాహతు గుర్తుకొచ్చి బాధపడటం మామూలై పోయింది రజితకు.

ఒక రోజు పదకొండు గంటలకు షాపు తెరవగానే యథాప్రకారం కేష్ కౌంటర్ దగ్గ రున్న నిలువెత్తు వెంకటేశ్వర స్వామికి దణ్ణం పెట్టుకుని తన కౌంటర్‌కి వెళ్లి అరలో కింద గా పెట్టిన చీర చూసుకుంది. లేదు. మొత్తం అరంతా, మిగిలిన అరలు పిచ్చి పట్టినట్టుగా వెతికింది. దొరకలేదు. అమూల్యమైన తన వస్తువేదో పోయినంత బాధ మనసులోంచి పుట్టు తిరుగుతూ కళ్లలో నీరుగా నిలిచింది.

"పొద్దున్నే అన్ని బట్టలు కింద పడేశావే మిటి? పిచ్చా.. కస్టమర్లు వొచ్చేలోగా సర్దేయ్" భూపతి గర్జించాడు.

అలాగే నీరసంగా అన్నీ సర్దసాగింది.

పొద్దుపోయేదాకా అలా అన్యమనస్కం గా పని చేస్తూనే ఉంది.

ఏడు గంటలకు భూపతి దగ్గరకు వెళ్ళి "ఒంట్లో బాగాలేదు.. కాస్త ముందుగా ఇంటికి పోతా" అంది.

"కస్టమర్లు వచ్చేదే ఇప్పుడు.. నువ్వు పోతే ఎట్లా?" ఉరిమాడు.

"ఈ ఒక్క రోజు వదలండి.." అంది ప్రాధేయపడుతూ.

"సర్లే వెళ్లు, మంచి రోజులెల్లేదాకా ఎవ రూ పర్మిషన్లు అడగొద్దు, సెలవులు పెట్టొద్దు" అందరికీ వినిపించేట్టుగా హూంకరించాడు.

రజిత షాపు నుంచి బయటపడి ఇం టివైపు నడవసాగింది.

"రాత్రి తనే అరలో కిందుగా జాగ్రత్తగా పెట్టిందే.. మరి రాత్రికి రాత్రి ఎవరు దాన్ని మాయం చేసారు? ఎవరికీ తెలియకుండా దాచుకుందే. అయినా ఎవరైనా చూసి తనను ఏడిపించడానికి దాచారేమో? లేదా ఇప్పుడు దాచుకుని తర్వాత కొనుక్కుంటారేమో? ఆ చీర అందం అలాంటిది. చూస్తే ఎవరూ వదల్లేరు' ఆలోచిస్తున్న కొద్దీ మనసులో బాధ మళ్లు తిరుగుతోంది.

కథ

# అపురూప కానుక

■ ప్రతాప వెంకట సుబ్బారాయుడు

షాపు సందు మలుపు తిరగ్గానే, అటుగా సైకిల్‌పై వస్తున్న రవి "అక్కా, గప్పుడే ఇంటికి బయల్దేరిన వేంది" అన్నాడు ఆందోళనగా.

"ఒంట్లో బాగాలేదు"

"గట్లనా.. దా ఎనక కూసో ఇంటికాడ దింపుతా"

"వొద్దు"

"అసలేమయింది, పానం ఎట్లున్నది" అడిగాడు.

తన బాధను పంచుకునేందుకు ఆత్మీయుడొకడు దొరికాడనుకుందో, ఏమో మొత్తం చెప్పేసింది.

అంతా విన్నాక రవి పడీ పడీ నవ్వి "ఓహ్.. దీనికా అంత బాధ.. నన్ను పొద్దుగాలనే సార్ పనిమీద బయటకు పంపించిండు. గిప్పుడే రావడం. లేకుంటే గింత అయ్యుండేది కాదు. గా సీర నీకెంత ఇష్టమో నువ్వు ఎవరూ సూడకూడదనుకున్నా, నేను గమనించినా.. నిన్న రాత్రి అందరూ పోయినాక బట్టలు సర్దుతుంటేగా సీర సూసినాక నాకో అయిడియా వచ్చింది. దాన్ని నేనే కొనేసినా. నీ పెళ్ళికి పెడదామను కున్నా, నువ్వేమో ఆగమాగమవుతుండావు.. గీడనే మా ఇల్లు తెలుసు కదా, ఇంటికస్తే నీకిస్తా, పెళ్లిదాక నువ్వుండేట్టు లేవు" అన్నాడు.



ఒక్క 'నేనే కొనేసినా' అన్నది తప్ప మరేం వినిపించుకోలేదు. ఆమె బాధ అంతా చేత్తో తీసేసినట్టు మాయమయిపోయింది. పోగొట్టుకున్న పెన్నిదేదో దొరికినంత ఆనందం. రవిని పట్టుకుని ఆనందంతో ఊపేసింది.

తర్వాత ఈ లోకంలోకి వచ్చింది. "మరి దాన్ని కొనడానికి అంత డబ్బు.. నీ ఆపరేషన్.." అయోమయంగా అడిగింది.

"అక్క కంటే ఎక్వనా, నాకేం కాదు, ఏమైనా అయితే నువ్వూకుంటవా? బావతో సెప్పి నన్ను బతికించవూ" అన్నాడు.

తోడబుట్టిన వాళ్లు కూడా అంతలా తాపత్రయపడరేమో. రజిత కళ్లలో నీళ్ల తిరిగాయి.

"నిజం రవి.. నీకేంకాదు.. కానివ్వను.. ఆ చీర నీ దగ్గరే ఉంచు. పెళ్లికి పెడుదువు గాని" అంది సంతోషంగా.

■